పండుగ పూట విషాదం

- రోడ్డు ప్రమాదంలో

భార్య మృతి, భర్తకు గాయాలు

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ మహేందర్

బెల్లంపల్లి, జనవరి 15 : సంకాంత్రి పండుగ పూట బెల్లంపల్లిలో విషాదం నెలకొన్నది. కాల్‌టెక్స్ జాతీయ రహదారి వద్ద మంగళ వారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య మృతి చెందగా, భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. ఆరేండ్ల కుమారుడు సురక్షితంగా బయటపడ్డాడు. టూటౌన్ ఎస్ఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం...కాగజ్ నగర్‌కు చెందిన అక్కు రాజేశ్ హైదరాబాద్‌లో మెకానిక్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. భార్య రేణుక, ఆరేండ్ల కుమారుడు వేదిక్‌తో కలిసి ఈసీఎల్ ఎక్స్ రోడ్డు వద్ద నివాసం ఉంటున్నారు. తన స్వస్థలం కాగజ్‌నగర్‌కు సోమవారం అర్ధరాత్రి హైదరాబాద్ నుంచి తన కారులో భార్య,కుమారుడితో కలిసి బయలుదేరాడు. మంగళవారం తెల్లవారు జామున కాల్‌టెక్స్ జాతీయ రహదారి గంగారాం నగర్ నక్షత్ర హోటల్ సమీపంలో ఆగి ఉన్న లారీని ఒక్కసారిగా కారుతో ఢీకొట్టాడు. దీంతో రేణుక (30)అక్కడికక్కడే మృతి చెందగా రాజేశ్‌కు ముఖం, కుడి భుజంపై తీవ్ర గాయాలయ్యాయి. కుమారుడి వేదిక్ సురక్షితంగా బయట పడ్డాడు. రేణుక మృత దేహాన్ని బెల్లంపల్లి దవాఖానకు తరలించారు. రాజేశ్‌ను మెరుగైన మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. రాజేశ్ తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

పూణెలో జరిగిన ప్రమాదంలో..

సంతోష్ (ఫైల్)

కన్నెపల్లి, జనవరి 15 : కన్నెపల్లికి చెందిన చెందిన దాగం సంతోష్(51) పూణేలో గత గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దాగం రమేశ్–చుక్కమ్మల కుమారుడు సంతోష్ ఉన్నత విద్యాబ్యాసం చేసి అమెరికాలో స్థిరపడ్డాడు. ఇటీవల హైదరాబాద్‌కు వచ్చిన సంతోష్ జనవరి 9న పూణెకు కారులో వెళ్తుండగా వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. దీంతో సంతోష్‌కు తీవ్ర గాయాలు కాగా డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. గాయాలపాలైన సంతోష్‌ను పూణెలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. సంతోష్ మరణంతో కన్నెపల్లిలో విషాద ఛాయలు నెలకొన్నాయి. సంతోష్‌కు భార్య ప్రశాంతి, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. సంతోష్ కన్నెపల్లిలో బస్ షెల్టర్ నిర్మించాడు. అతను చదువుకున్న పాఠశాలకు స్టేజ్ ఏర్పాటు చేసి మౌలిక వసతులు కల్పించాడు. వేంకటేశ్వర ఆలయ నిర్మాణానికి విరాళం అందించాడు. ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టిన సంతోష్ మరణంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ట్రాక్టర్‌పై నుంచి పడి యువకుడి మృతి

కాసిపేట, జనవరి 15 : కాసిపేటలోని రహదారిపై ట్రాక్టర్‌పై నుంచి కింద పడి తీవ్రగాయాలు కాగా చికిత్స పొందుతూ పెద్దనపల్లికి చెందిన పల్లె శ్రీరామ్(19) మృతి చెందినట్లు కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం..శ్రీరామ్‌తో పాటు పలువురు సోమగూడెంలో ట్రాక్టర్‌లో సిమెంట్ ఇటుకలను నింపుకొని దేవాపూర్‌కు తీసుకువెళ్లి అక్కడి దింపి తిరిగి వస్తున్న క్రమంలో కాసిపేటలో ట్రాక్టర్ డ్రైవర్ పంది లక్ష్మణ్ అతి వేగంగా అజాగ్రత్తగా నడపడంతో శ్రీరామ్ ట్రాక్టర్‌పై నుంచి కింద పడగా పొట్ట భాగంలో గాయాలయ్యాయి. బెల్లంపల్లి దవాఖానకు తీసుకువెళ్లారు. అక్కడి నుంచి మైరుగైన చికిత్స కోసం మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తీసుకు వెళ్లగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు వివరించారు. ఈ మేరకు మృతుడు తండ్రి పల్లె శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

యువకుడి ఆత్మహత్య

నవీన్ (ఫైల్)

బెజ్జూర్, జనవరి 15 : మండల కేంద్రానికి చెందిన కావిడె నవీన్ (25) మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం. నవీన్ నెల రోజులుగా తాగుడుకు బానిసయ్యాడు. దీంతో తలిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి గురైన నవీన్ పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి దవాఖానకు తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడి తండ్రి దేవయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జయరామారావుకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



జయరామారావును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు

మంచిర్యాల అర్బన్, జనవరి 15: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గౌతమీ నగర్‌కు చెందిన బీజేపీ నాయకుడు మెట్టుపల్లి జయరామారావుపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసిన సంఘటన బుధవారం కలకలంరేపింది. బాధితుడు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని బైపాస్‌రోడ్డులో సంజీవయ్య కాలనీలో చేపల మార్కెట్లో చేపలు కొనేందుకు జయరామారావు వెళ్లాడు. అక్కడికి వచ్చిన గుర్తు తెలియని ముగ్గురు దుండగులు అతడిపై దాడి చేశారు. స్థానికులు కేకలు వేయడంతో దుండగులు అక్కడి నుంచి పారిపోయారు. జయరామారావును స్థానికులు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి కుటుంబ సభ్యులు ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. గతంలో మున్సిపల్ అభివృద్ధికి సంబంధించి బైపాస్ రోడ్డు రాళ్లపేట నుంచి గుడికి వెళ్లే దారిలో గల రోడ్డు, డ్రైనేజ్ పనుల విషయంలో మున్సిపల్ శాఖ అధికారులకు తాను ఫిర్యాదు చేశానని, దీన్ని దృష్టిలో ఉంచుకొని మంతెన జగన్ మోహన్ రావు తన అనుచరులతో ఈ దాడికి పాల్పడినట్లు జయరామారావు తెలిపాడు. దవాఖానలో చికిత్స పొందుతున్న జయరామారావును బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్ రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబల్లి రఘునాథ్ రావు, పలువురు నాయకులు పరామర్శించారు. ఈ విషయం పై పట్టణ సీఐ ప్రమోద్ రావును వివరణ కోరగా బాధితుడు భార్య మెట్టుపల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

ఆర్మీ జవాన్ల సేవలు మరువలేనివి

ఆర్మీ జవాన్ తల్లిని సన్మానిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

తాండూర్, జనవరి 15 : దేశ రక్షణలో జవాన్ ల సేవలు మరువలేనివని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 107 ఏ కార్పొరేట్ వైస్ చైర్మన్, గోల్డెన్ స్టార్ కేశెట్టి సంతోష్ కుమార్ అన్నారు. బుధవారం ఆర్మీ దినోత్సవం సందర్భంగా శ్రీనగర్ (జమ్ము కాశ్మీర్) లో విధులు నిర్వహిస్తున్న తాండూర్ మండల కేంద్రం సుభద్ర కాలనీకి చెందిన ఆర్మీ జవాన్ పుప్పాల లక్ష్మన్‌తో పాటు మాదారం టౌన్‌షిప్ కు చెందిన కీర్తి,శే ఆర్మీ జవాన్ గోనె రాజేంద్రప్రసాద్ (త్రిపుర నూట నలభై బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తున్న సమయంలో 2011ఫిబ్రవరి 8న మృతి చెందాడు)ఆయన తల్లి గోనె రాజమ్మను వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి స్వీట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ తాండూర్ అధ్యక్ష, కార్యదర్శులు మైలారపు మధుసూదన్, కాసనగొట్టు మణికృష్ణ, కోశాధికారి రాచకొండ మహేశ్, సభ్యులు సామా రమేశ్, కాసం భాస్కర్, పూటూరి నరేశ్, పుల్లూరి సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

భీమారంలో..

భీమారం, జనవరి 15 : భీమారంలో రిటైర్డ్ ఆర్మీ జవాన్ కొమ్ము రాజన్న యాదవ్‌తో పాటు విధులు నిర్వహిస్తున్న ఆవుల మహేశ్‌ను శాలువాలతో తో రేషవేణి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కొమ్ము సురేందర్ యాదవ్, మెండె మల్లేశ్, కేశవేణి సత్యనారాయణ, నూతి నాగరాజు, సంతోష్, సురేశ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

మంచిర్యాల అర్బన్, జనవరి 15: మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని హమాలీవాడ, దొరగారిపల్లే, రాజీవ్‌నగర్, గోపాల్‌వాడ, సూర్యనగర్, రాజరాజేశ్వరి కాలనీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు పరిశీలించారు. సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రాజీవ్‌నగర్ ఏరియాలోని కస్తుర్బాగాంధీ బాలికల పాఠశాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కౌన్సిలర్లు, పట్టణ వాసులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల ప్రవేశపరీక్ష పోస్టర్ విడుదల

బెల్లంపల్లి, జనవరి 15 : గురుకుల పాఠశాలల్లో ప్రవేశం కోసం నిర్వహించే గురుకుల కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ 2025 పోస్టర్‌ను మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల సీఈవో ప్రిన్సిపాల్ దూట శ్రీధర్, కాసిపేట గురుకుల ప్రిన్సిపాల్ మోటూరి సంతోష్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేతేశ్వర కంకాలమ్మ జాతరకు ఏర్పాట్లు

జన్నారం, జనవరి 15 : మండల కేంద్రంలోని పొనకల్‌లో వీర్లగుట్టపై గల శ్రీకేత్యేశ్వర కంకాలమ్మ, శివాలయం 11వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 19న జాతర నిర్వహణకు మహేంద్ర సంఘం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. భక్తులకు వసతులు కల్పిస్తున్నట్లు కమిటీ చైర్మన్ ఎమ్మార్ నర్సింగ రావు, అధ్యక్షుడు సిలివేరి నర్సయ్య తెలిపారు.

బాల్య మిత్రుడికి బాసటగా..

ఆర్థిక సహాయం అందజేస్తున్న బాల్య మిత్రులు

దండేపల్లి, జనవరి15: దండేపల్లికి చెందిన మంద రాజు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. నిరుపేద కుటుంబం కావడంతో అతనితో పాటు చదువుకున్న 2004–05 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన బాల్య మిత్రులు
రాజు కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచారు. కూతురి భవిష్యత్, ఉన్నత చదువులకు సహకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బాల్య మిత్రులు ఉన్నారు.

పద్మల్‌పురి కాకో ఆలయంలో భక్తుల సందడి

దండేపల్లి, జనవరి15: దండేపల్లి మండలంలోని గుడిరేవు గోదావరి తీరాన ఉన్న పద్మల్‌పురి కాకో ఆలయానికి జంగు లింగు–జంగుబాయి భక్తులు బుధవారం పెద్ద సంఖ్యలో తరలివచి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జీసీసీ చైర్మన్ కోట్నాక తిరుపతి, జంగుబాయి దీక్ష పీఠాధిపతి కొమ్రం భగవంతరావు, గోండి ధర్మ గురు కినుక బారికరావు, ఆలయ చైర్మన్ సోము, లింగారావు, తదితరులు ఉన్నారు.

ధ్యానంతోనే ప్రశాంతత

దండేపల్లి, జనవరి 15 : ధ్యానంతోనే ఒత్తిడి తగ్గి జీవనం ప్రశాంతంగా సాగుతుందని హార్ట్‌ఫుల్ నెస్ ధ్యాన కేంద్రం జిల్లా కో ఆర్డినేటర్ సీహెచ్ ప్రవీణ అన్నారు. దండేపల్లిలో బుధవారం హార్ట్‌ఫుల్ సంస్థ ఆధ్వర్యంలో ధ్యానంపై మూడు రోజుల పాటు నిర్వహించనున్న యోగ–ధ్యాన శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్థానికులతో ధ్యానం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం నిత్య జీవితంలో ఎన్నో ఒత్తిళ్లకు లోనవుతామని, ధ్యానం చేస్తే ప్రశాంతంగా ఉండడంతో పాటు జీవన విధానాన్ని అన్ని విధాలా మెరుగుపరుచుకొవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ కోఆర్డినేటర్ పవన్‌కుమార్, జనాన్, శ్రీహరి, ఈశ్వరయ్య, శ్రీధర్, రమేశ్, తదితరులు ఉన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబురాలు

ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతున్న ఆదివాసీ నాయకులు

మంచిర్యాల అర్బన్, జనవరి 15: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు తమ కుటుంబ సభ్యులతో కలిసి జిల్లా కేంద్రంలోని ఎల్ఐసీ కాలనీలోని తమ నివాసంలో మంగళవారం మకర సంక్రాంతి సంబురాలను అంగరంగ వైభవంగా నిర్వహించుకున్నారు. సంక్రాంతి పండుగను అందరూ సంతోషంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీసుకున్న నిర్ణయంతో ఇప్పటికీ రాష్ట్రం మొత్తం పచ్చగా కళకళలాడుతుందని తెలిపారు. అనంతరం ఆయనకు మంచిర్యాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు.

బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ టౌన్, జనవరి15: మండలంలోని బాబాపూర్‌లో నిర్వహించిన కబడ్డీ పోటీలకు ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. అదే గ్రామంలో ఎడ్ల పందేలను మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్, బీఆర్ ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆదివాసీ నాయకుల శుభాకాంక్షలు

ఆసిఫాబాద్ టౌన్, జనవరి15: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని బుధవారం తిర్యాణి మండల మైకేల్ యార్క్ గోండు మహిళా సంఘం నాయకులు, గోండు యువజన సంఘం నాయకులు ఎమ్మెల్యే కోవ లక్ష్మిని ఆమె నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలుపుతూ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మెడికుర్సెంగ మోతీరాం. సర్మేది ఆడ తాను, కార్యదర్శి నర్సింగరావు, గడాల్‌పల్లి కత్ముండ, నాయకులు కేశవరావు, జలపతి, ఉండిరి తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపేటలో ఫెండ్లీ క్రికెట్ మ్యాచ్

దండేపల్లి, జనవరి 15: మండలంలోని తాళ్లపేటలో ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. రాజకీయ నాయకుల టీంకు రాష్ట్ర ఆర్థిక, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్(జీసీసీ) కోట్నాక తిరుపతి కెప్టెన్‌గా వ్యవహరించి టీం సభ్యులను ఉత్సాహ పరిచాడు.

ముల్కల్లలో షటిల్ టోర్నమెంట్

హాజీపూర్, జనవరి 5 : మండలంలోని ముల్కల్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో షటిల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీల్లో మొత్తం 14 జట్లు పాల్గొనగా బుధవారం ఫైనల్ పోటీలలో మొదటి విజేతగా కృష్ణమూర్తి–జక్కుల వెంకటేశ్ జట్టు, ద్వితీయ విజేతగా మంచాల శ్రీనివాస్–పెట్టెం మల్లేశ్ విజేతలుగా నిలిచారు. వీరికి నాయకులు బహుమతులు అందజేశారు.

కిష్టాపూర్‌లో ఎడ్ల బండ్ల పోటీలు

జైపూర్, జనవరి 15 : మండలంలోని కిష్టాపూర్‌లో మంగళవారం ఎడ్లబండ్ల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జైపూర్, సింగాపూర్, మందమర్రి, భీమిని, దహేగాం, కన్నెపల్లి, నెన్నెల మండలాలకు చెందిన పోటీదారులు పాల్గొన్నారు. మొత్తం 20 టీంలు పాల్గొనగా నస్పూర్ మండలంలోని సింగపూర్‌కు చెందిన టీం మొదటి బహుమతి గెలుచుకున్నట్లు నిర్వాహకులు చందుపట్ల జనార్దన్‌రెడ్డి, పాపిరెడ్డి తెలిపారు. మొదటి బహుమతి 10వేల నగదు సింగపూర్ వారు గెలుచుకోగా రెండవ బహుమతి 8వేల నగదు నెన్నెల మండలం జెండా వెంకటాపూర్ వారు గెలుచుకున్నారు. మూడవ బహుమతి రూ.6వేల నగదు భీమిని మండలం టేకులపల్లి వారు గెలుచుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

లక్ష్మీపూర్‌లో పరుగు పందెం పోటీలు

కన్నెపల్లి, జనవరి 15 : భీమిని మండలంలోని లక్ష్మీపూర్‌లో శ్రీరామ సేవా సమితి ఆధ్వర్యంలో యువకులకు వివిధ విభాగాల్లో పరుగు పోటీలను నిర్వహించారు. విజేతలకు భీమిని ఎస్ఐ విజయ్‌కుమార్, పోతురాజుల రాజయ్య, లక్ష్మణ్, శ్రీనివాస్, శ్రీకాంత్ బహుమతులు అందజేశారు.

హాజీపూర్‌లో సైకిల్ పోటీలు

హాజీపూర్, జనవరి 15 : హాజీపూర్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సైకిల్ పోటీలను హాజీపూర్ ఎస్ఐ గోపతి సురేశ్ ప్రారంభించారు. మండలంలోని 120 మంది విద్యార్థులకు విభాగాల వారీగా పోటలు నిర్వహించారు. విజేతలుగా నగదు బహుమతులు, పతకాలు అందజేశారు.

తాండూర్‌లో..

తాండూర్, జనవరి 15 : తాండూర్ యూత్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు, టగ్ ఆఫ్ వార్, కబడ్డీ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. వాసవీ క్లబ్ తాండూర్ ఆధ్వర్యంలో పతంగుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

నేడు ఈజీఎస్ ప్రజా వేదిక

కాసిపేట, జనవరి 15 : కాసిపేట మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నేడు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సత్యనారాయణ సింగ్ తెలిపారు. కాసిపేట మండల ఉపాధి హామీ పథకం 14వ విడుత సామాజిక తనిఖీలో భాగంగా కాసిపేట మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో 01.04.2023 నుంచి 31.03.2024 వరకు చేపట్టిన పనులను సామాజిక తనిఖీ బృందాలు 02.01.2025 నుంచి 09.01.2025 వరకు సామాజిక తనిఖీ చేసినట్లు తెలిపారు. అట్టి పనులపై తనిఖీ బృందాలు తుది నివేదికపై అధికారులు చర్చ జరిపేందుకు గురువారం ఉదయం 7.30 గంటలకు ప్రజావేదిక నిర్వహించనున్నట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు హాజరు కావాలని సూచించారు.

నేడు పెద్దాపూర్‌లో వైద్య శిబిరం

కాసిపేట, జనవరి 15 : కాసిపేట మండలంలోని పెద్దాపూర్‌లో గురువారం మెడికల్ క్యాంప్ నిర్వహించనున్నట్లు వైద్యాధికారి రవి కిరణ్ తెలిపారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహించే స్పెషల్ మెడికల్ క్యాంప్ ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుందన్నారు. ఈ మెడికల్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

తాండూర్, జనవరి 15 : బెల్లంపల్లి ఏరియా గోలేటి, మాదారం టౌన్‌షిప్‌లలో సింగరేణి సేవా సమితి ద్వారా అందించనున్న వృత్తి శిక్షణ కోర్సులు నేర్చుకునేందుకు ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని అధికార ప్రతినిధి రెడ్డిమల్ల తిరుపతి ఒక ప్రకటన ద్వారా కోరారు. మాదారంలో యోగా, ఫ్యాషన్ డిజైనింగ్, మగ్గం, బ్యుటీషియన్ కోర్సులు, గోలేటిలో యోగా, బ్యుటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, డీటీపీ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 18 వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు జీఎం కార్యాలయం ఏటీబీ సెల్‌లో దరఖాస్తులు అందజేయాలని కోరారు. సందేహాలుంటే సేవా సమితి కో ఆర్డినేటర్ నంబర్ 9951214116కు సంప్రదించాలని అన్నారు.

ఎస్టీపీపీ ఉద్యోగుల ప్రతిభ

జీ శ్రీనిధి

జైపూర్, జనవరి 15: ఈ నెల 14, 15వ తేదీల్లో కోల్ ఇండియా నిర్వహించిన కల్చరల్ మీట్ ఎస్టీపీపీ ఉద్యోగులు ప్రతిభ కనభర్చారు. ఇంటర్ కల్చరల్ మీట్ 2024–25 పోటీలను అనుబంధ ఈస్టర్న్ కోల్ ఫీల్డ్స్ లిమిటెడ్ కంపెని పశ్చిమ బెంగాల్‌లో రెండు రోజులపాటు కల్చరల్‌మీట్ నిర్వహించగా ఎస్టీపీపీ ఉద్యోగులు పాల్గొన్నారు. వేణుగానంలో బీ రవీంద్రకుమారస్వామి ఫోర్‌మెన్, కర్ణాటక సంగీతంలో బీ శ్రీనిధి సీనియర్ అసిస్టెంట్‌లు పాల్గొని ప్రథమ బహుమతి సాధించారు. కాగా వీరిద్దరు తండ్రి కూతుళ్లు కావడం గమనార్హం. వీరిని ఎస్టీపీపీ ఈడీ రాజశేఖర్ ఫోన్ ద్వారా అభినందించారు.

అక్రమమంటూ పార్కు నిర్మాణాల కూల్చివేత

- వార్డు ప్రజలు అడ్డుకున్నా వినని సింగరేణి సెక్యూరిటీ సిబ్బంది

కూల్చివేసిన మున్సిపాలిటీ అభివృద్ధి పనుల నిర్మాణం

రామకృష్ణాపూర్, జనవరి 15: క్యాతనపల్లి మున్సిపాలిటీలోని 4వ వార్డు శాంతినగర్ (ఆర్కే4 గడ్డ)లో నిర్మాణం అవుతున్న చిల్డ్రన్ ప్లే ఎక్విప్‌మెంట్‌ను నిర్మాణ పనులను అక్రమ నిర్మాణం అంటూ మంగళవారం మధ్యాహ్నం సింగరేణి సెక్యూరిటీ వాచ్‌మెన్ పెద్దులు, జమేదార్ డీ. లక్ష్మణ్ ఆరుగురు ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బందితో వచ్చి కూల్చివేశారు. చిల్డ్రన్ ప్లే ఎక్విప్ మెంట్ నిర్మాణాలను కూల్చివేతలను చూసిన స్థానిక వార్డు ప్రజలు, వార్డు కౌన్సిలర్ ఓదెలు, కో–ఆప్షన్ సభ్యుడు యాకూబ్‌అలీకి తెలుపగా అక్కడికి చేరుకొని ఎందుకు కూల్చివేస్తున్నారని సెక్యూరిటీ సిబ్బందిని ప్రశ్నించారు. ఈ స్థలం సింగరేణి సంస్థకు చెందినదని ఇక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదంటూ కూల్చివేస్తున్నామని సెక్యూరిటీ సిబ్బంది తెలిపారు. ఈ స్థలం మున్సిపాలిటీకి సరెండర్ చేశారని కాంట్రాక్టర్ ద్వారా అభివృద్ధి పనులను మున్సిపల్ అధికారులు చేట్టారని చెప్పినా వినకుండా కూల్చివేశారు. దీంతో సెక్యూరిటీ సిబ్బందిపై ప్రజలు అగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సమాచారం అందుకున్న పోలీసుల జోక్యంతో ప్రజా ప్రతినిధులు, సెక్యూరిటీ సిబ్బంది అక్కడి నుండి వెళ్లిపోయారు. ఈ విషయమై ప్రజా ప్రతినిధులు, సింగరేణి సెక్యూరిటీ సిబ్బంది ఒకరిపై ఒకరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేశారు.

అభివృద్ధికి సింగరేణి సెక్యూరిటీ అడ్డు

క్యాతనపల్లి మున్సిపాలిటీ పట్టణ అభివృద్ధికి సింగరేణి సెక్యూరిటీ, ఎస్టేట్ సిబ్బంది అడ్డు తగులుతున్నారని అని 4వ వార్డు ప్రజలు, మున్సిపాలిటీ వార్డు కౌన్సిలర్ రేవెల్లి ఓదెలు, కో–ఆప్షన్ సభ్యుడు ఎండీ యాకూబ్ అలీ ఆరోపించారు. గత మాజీ ప్రభుత్వ విప్, చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్ సింగరేణి భూములు సేకరణ కోసం క్యాతనపల్లి మున్సిపల్ అధికారులు ప్రతిపాదనలు తయారు చేసి నాటి మంచిర్యాల కలెక్టర్ భారతీ హోళికేరికి పంపారని తెలిపారు. పట్టణ ప్రగతి కింద ఆటస్థలం, బతుకమ్మ ఘాట్ నిర్మాణం, అభివృద్ధి పనుల కోసం సర్వే నెం 7లో 2 ఎకరాల భూమిని సింగరేణి యాజమాన్యం 2021 ఫిబ్రవరిలో మ్యునిసిపాలిటీకి అప్పగించిందనితెలిపారు. ఈ విషయం సెక్యూరిటీ సిబ్బందికి తెలిపినా వినకుండా కూల్చివేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కూల్చివేతకు ఏరియా జీఎం ఆదేశించలేదు..

ఈ విషయమై క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ గద్దె రాజును వివరణ కోరగా పట్టణ ప్రగతి పనుల కోసం నిర్మాణం చేపట్టిన పనులను కూల్చివేసేందుకు ఏరియా జీఎం స్థాయి ఉన్నతాధికారుల, ఎస్టేట్ అధికారుల ఆదేశాలు లేవని, ఎలాంటి నోటీసు ఇవ్వలేదని ఆయన తెలిపారు. ఎలాంటి ఆదేశాలు లేకుండానే క్రింది స్థాయి సెక్యూరిటీ సిబ్బంది అత్యుత్సాహం ప్రదర్శించి నిర్మాణ పనులను కూల్చివేయడం సరికాదని తెలిపారు. కూల్చివేసిన పనులను సింగరేణి యాజమాన్యమే నిర్మించి ఇవ్వాలని తెలిపారు. కూల్చివేతలకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని సింగరేణి అధికారులను కోరారు. కూల్చివేతకు పాల్పడిన సెక్యూరిటీ సిబ్బందిపై ఫిర్యాధు చేస్తామని తెలిపారు.

పల్లె ప్రకృతి వనం కూల్చి..శ్మశాన వాటిక నిర్మించొద్దు

- కలెక్టర్‌కు హాజీపూర్ గ్రామ స్తుల వినతి

కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చిన మాజీ సర్పంచ్, ఎంపీటీసీ, ప్రజలు

హాజీపూర్, జనవరి 15 : మండల కేంద్రంలో ఏర్పాటు చేయనున్న శ్మశాన వాటికను పల్లెప్రకృతి వనం స్థలంలో అనుమతి ఇవ్వొద్దంటూ హాజీపూర్ గ్రామ ప్రజలు కలెక్టర్ కుమార్ దీపక్‌కు బుధవారం వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగేండ్ల క్రితం హాజీపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన శ్మశానవాటికను అందరికీ అందుబాటులో ఉందని తెలిపారు. కాని కొందరు వ్యక్తులు గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాన్ని తొలగించి అక్కడ ఈజీఎస్ నిధులతో శ్